క్లుప్తంగా

8న బూత్‌స్థాయి సమావేశం

సీతానగరం: రాజమహేంద్రవరంలో ఈనెల 8న జరిగే బూత్‌స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని రాజానగరం నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి పిలుపునిచ్చారు. ఆయన శనివారం వెదుళ్లపల్లిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. అడబాల గణపతిరావు, రజనీ, ఖండవల్లి సాయి, సాదే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

సీతానగరం: ఇనుగంటివారిపేటలోని రామాలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పైడివాడ సత్యనారాయణ, వేణు దంపతులతో అర్చకుడు ఆరాధ్యుల సాయికుమార్ శర్మ ఘనంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామివారు

పెదపూడి: మండలంలోని సంపర వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఉదయం స్వామి వారికి తులసి పూజ, అమ్మవారికి కుంకుమ పూజ జరిపారు. అనంతరం స్వామికి పంచామృతాభిషేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఏపీ జేఏసీ జిల్లా కో చైర్మన్‌గా ప్రమీలారాణి



గంధం ప్రమీలారాణి

గోకవరం: ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల జేఏసీ సంఘం జిల్లా కో చైర్మన్‌గా రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం గంధం ప్రమీలారాణి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరంలోని రెవెన్యూ భవనంలో శనివారం ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

గోకవరం: స్థానిక కోర్ల వీరాస్వామి (కేవీఎస్) డిగ్రీ కళాశాలలో సోమవారం కేవీఎస్ డిగ్రీ కళాశాల, వికాస ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీవీవీ ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ, కోజెంట్ ఇ సర్వీసెస్‌లో బీపీఓ, డిక్సాన్, సియోన్ ఇ-డబ్ల్యూఏ సుమిత్, ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ డిప్లొమో, బీటెక్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై 35 సంవత్సరాల లోపు యువతీయువకులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98852 70488 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

జల చౌర్యం కాదది.. జనహితం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం రక్షిత మంచి నీటి పథకం నుంచి జల చౌర్యం జరుగుతుందంటూ టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలో వాస్తవం లేదని సర్పంచ్ బుంగా రామారావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత మే నెల నుంచి జలజీవన్ మిషన్‌లో ఇంటింటికీ కుళాయి ఏర్పాటుచేసే క్రమంలో పాత వాటర్ పైప్‌లైన్ దెబ్బతినడంతో సుమారు పది రోజుల పాటు ప్రజలకు నీటి ఇబ్బంది లేకుండా ట్యాంకుల ద్వారా సప్లయి చేశామన్నారు. ప్రజలకు ఎప్పుడు అవసరమున్నా ట్యాంకుల ద్వారా పంపిస్తున్నామని, నిజం తెలుసుకోకుండా నీటిని అమ్ముకుంటున్నారంటూ తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు.

నేడు కాపు ఉపాధ్యాయుల వనసమారాధన

గోకవరం: ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరం లాలా చెరువులోని పుష్కరవనంలో కార్తిక వనసమారాధన నిర్వహించనున్నట్టు సంఘం గౌరవాధ్యక్షుడు చేబ్రోలు చలం, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపిశెట్టి బంగార్రాజు, మద్దాల అప్పారావు శనివారం తెలిపారు. శనివారం వారు గోకవరం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులను వనసమారాధనకు ఆహ్వానించారు. కాపు ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అంతర పంటల సాగు.. లాభాలు బాగు

- ఏడాదిలో రెండు పంటలు
- రైతులకు అదనపు ఆదాయం



సుభద్రంపేటలో పామాయిల్ తోటలో మినుము సాగు

రంగంపేట: మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలో అంతర పంటల సాగుకు రైతులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. పామాయిల్, మామిడి, జీడి మామిడి, నిమ్మ, బత్తాయి, సీతాఫల తోటల్లో రైతులు అంతర పంటలు సాగుచేస్తూ అదనపు ఆదాయం ఆర్జిస్తున్నారు. నీటి వనరులు అంతంత మాత్రంగా ఉండే మెట్ట ప్రాంతంలో తక్కువ నీటితో పండే పంటలను సాగుచేస్తున్నారు. ముఖ్యంగా వివిధ రకాల కూరగాయలను పండిస్తూ రాజమహేంద్రవరం, కాకినాడ మార్కెట్‌లకు తరలిస్తూ మంచి లాభాలు పొందుతున్నారు. కొందరు వ్యాపారులు పొలాల వద్దకే వచ్చి కూరగాయలను కొనుగోలు చేసి పట్టణ ప్రాంతాలకు తీసుకువెళుతున్నారు.

ఒకవైపు అపరాలు.. మరోవైపు కూరగాయలు..

మండలంలోని సుభద్రంపేట, కోటపాడు, వెంకటాపురం, దొడ్డిగుంట, సింగంపల్లి, మర్రిపూడి, నల్లమిల్లి, దొంతమూరు, వీరంపాలెం, ఈలకొలను, ముకుందవరం గ్రామాల్లోని భూముల్లో పామాయిల్, మామిడి, జీడిమామిడి, నిమ్మ, బత్తాయి, సీతాఫలం తోటల్లో పెసర, మినుము, నువ్వులు వంటి అపరాల పంటలతో పాటు వంగ, బీర, బెండ, దొండ, మిరప, ఆనబ, చిక్కుడు, గోరుచిక్కుడు, కాకర, కంద, ఆగాకర వంటి కూరగాయల పంటలు పండిస్తున్నారు. వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం వంటి గ్రామాల్లో వ్యవసాయ బోర్లు, చెరువులు, చాగల్నాడు ఎత్తిపోతల పథకం ఆయకట్టు పరిధిలోని నీరు లభ్యమయ్యే భూముల్లో వరి, శనగ సాగు చేస్తున్నారు.

పెట్టుబడి తక్కువ

అంతర పంటలకు ఖర్చు తక్కువ అవ్వడం, ఆదాయం బాగుండటంతో పాటు ముఖ్యంగా నీటి అవసరం తక్కువగా ఉండటంతో రైతులు అంతర పంటల సాగుపై మక్కువ చూపిస్తున్నారు. ఉద్యాన పంటలు వేసిన మూడు, నాలుగు సంవత్సరాల వరకూ రైతులకు ఎటువంటి ఆదాయం రాకపోవడంతో అంతర పంటల ద్వారా ఆదాయాన్ని రాబడుతున్నారు. ఉద్యాన పంటలకు ఏర్పాటుచేస్తున్న డ్రిప్ ద్వారా అంతర పంటలకు నీటిని అందిస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. మండలంలో అధిక శాతం వర్షాధారంగానే పంటలు సాగు చేస్తున్నారు. దీంతో తక్కువ నీటితో పండే పంటలపై రైతులు మొగ్గుచూపుతున్నారు.



పామాయిల్ తోటలో వంగ సాగు

అంతర పంటలకు ప్రభుత్వ రాయితీలు



అంతర పంటల సేద్యం చేసే రైతులకు ప్రభుత్వం హెక్టారుకు రూ.4 వేలు చొప్పున ప్రభుత్వం అందిస్తుంది. అదేవిధంగా హైబ్రీడ్ విత్తనాలు కొనే రైతులు బిల్లులు అందిస్తే మరో రూ.3 వేలు ఇస్తారు.

– కె.దివ్యశ్రీ, ఉద్యాన అధికారి, రంగంపేట మండలం

అంతర పంటలో ఆదాయం బాగుంది



పామాయిల్ మొక్క తోటలో కూరగాయల సాగు చేస్తున్నాను. రెండు ఎకరాల్లో వంగ మొక్కలు పెట్టాను. దీంతో ఖర్చు తక్కువ అవుతుంది. దిగుబడి బాగా వస్తే ఆదాయం అధికంగా వస్తుంది.

– అలమండ సాయిరామ్, రైతు, సింగంపల్లి గ్రామం

నేడు స్వామి వివేకానంద టాలెంట్ టెస్ట్

అనపర్తి: అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి, స్థానిక జీబీఆర్ విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో నిర్వహించే స్వామి వివేకానంద టాలెంట్ టెస్ట్ 2023–24 ఆదివారం నిర్వహించనున్నట్లు రామకృష్ణ మిషన్ సభ్యులు ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. అనపర్తి పరిసర నియోజకవర్గాల్లోని 8 మండలాల పరిధిలో సుమారు 60 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాఠశాల స్థాయిలో 3న, మండల స్థాయిలో ఈ నెల 10న స్థానిక జీబీఆర్ విద్యా సంస్థల ప్రాంగణంలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 9 గంటల లోపు పరీక్షా కేంద్రానికి రావాలన్నారు.

నేడు దివ్యాంగులకు పరికరాల పంపిణీ

రాజానగరం: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని చక్రద్వారబంధంలో దివ్యాంగులకు అవసరమైన పరికరాలు పంపిణీ చేయనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు హియరింగ్ మిషన్స్, ట్రైసైకిళ్లు, వీల్ చైర్స్, మూడు చక్రాల స్కూటర్లను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయనున్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

- డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ
- పశ్చిమగానుగూడెంలో పట్టాల పంపిణీ



పశ్చిమగానుగూడెంలో పట్టాలు పంపిణీ చేస్తున్న జక్కంపూడి రాజశ్రీ

మధురపూడి: అర్హత ఉన్న పేదలందరికీ ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడమే జగన్ ప్రభుత్వం సంకల్పమని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ అన్నారు. పశ్చిమగానుగూడెంలో శనివారం ఇళ్ల స్థలాల పట్టాలను అందజేశారు. కోరుకొండ మండలం కాపవరంలోని 40 ఎకరాల ప్రభుత్వ భూమిలో నాలుగు గ్రామాలకు చెందిన 1,500 మందికి హక్కు కల్పిస్తూ పట్టాలను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఈ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు పట్టాలను రాజశ్రీ అందించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు ఉండకూడదన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. దానిలో భాగంగానే ప్రభుత్వం భూములను కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రాజానగరం నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి, మరో రూ.వెయ్యి కోట్లతో సంక్షేమ పథకాలను అందించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని మిగిలిన నియోజకవర్గాల కంటే మరింత జోరుగా ఇక్కడ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కానవరంలో గడప గడపకూ..



కానవరంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: గ్రామాలాభివృద్ధికి జగన్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని కానవరంలో శనివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగ, క్షేమాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలలో ఎవరెవరికి ఏఏ పథకంలో ఏమేరకు ప్రయోజనం చేకూరిందో వివరించారు. గడచిన నాలుగున్నరేళ్లలో గ్రామంలో రూ.4.55 కోట్లతో అభివృద్ధి పథకాలను అమలు చేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇక్కడ అభివృద్ధి పనులకు కేవలం రూ.56 లక్షలు మాత్రమే కేటాయించారన్నారు. గతంలో పాలకులు మీకు ఎన్నికల సమయంలోనే కనిపించేవారని, కానీ జగనన్న పాలనలో నిరంతరం ప్రజలతో మమేకం అవుతున్నామన్నారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ నివాస స్థలాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సమస్యల పరిష్కారంలోను పూర్తి అవగాహనతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే ఎన్నికలలో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైస్‌ఎంపీపీ కోడి రాఘవ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు అనదాస సాయిరామ్, యర్రంశెట్టి శ్రీరామకృష్ణ, ఎస్.వీర వెంకట్రావు, బాసిబాబు, ఎస్.వెంకటేశ్వర్రావు, సత్తిబాబు, సత్యంబాబు, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్నకు మీ దీవెనలు ఉండాలి



బాలవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- బాలవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ ప్రజల దీవెనలు ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బాలవరం గ్రామంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలోని 350 ఇళ్లను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా నెరవేర్చి దేశంలోనే ఉత్తమ ముఖ్యమంత్రిగా సీఎం జగన్ పేరు తెచ్చుకున్నారన్నారు. రాష్ట్రాభివద్ధి, సంక్షేమ పాలన కోసం వచ్చే ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, సర్పంచ్ గోలి రమణ, ఎంపీటీసీ గోలి వెంకటకృష్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, గ్రామ కన్వీనర్ తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



అచ్యుతాపురంలో పూడిక తీత పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ జగదాంబ

గోకవరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ జగదాంబ సూచించారు. మండలంలోని కొత్తపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆమె పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. జనవరి నెలాఖరు నాటికి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కామరాజుపేట గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో క్రీడా మైదానాన్ని పరిశీలించారు. అచ్యుతాపురంలో చెరువుల్లో పూడికతీత పనులను పరిశీలించి సిబ్బంది పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, ఏఓ కిశోర్‌కుమార్, ఏపీఓ పీఎస్ అప్పలరాజు, కార్యదర్శి చిన్నకుమార్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పి సంరక్షణ

సీతానగరం: చీపురపల్లి పంచాయతీ అచ్చియ్యపాలేనికి చెందిన నాగేశ్వరరావు, వెంకయ్యమ్మ రెండు నెలల క్రితం పొలంలో పని చేస్తుండగా కుక్కల దాడిలో గాయపడిన దుప్పి పిల్ల కనిపించింది. వెంటనే వారు దాన్ని రక్షించారు. అప్పటి నుంచి దాణా వేసి మేపుతున్నారు. ఈ నేపథ్యంలో అటవీశాఖాధికారులు శనివారం ఆ దుప్పిని స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరంలోని అటవీవనంలో దాన్ని వదిలిపెడతామన్నారు.

కేంద్ర కారాగారంలో వసతుల పరిశీలన

కంబాలచెరువు: రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారాన్ని శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత సందర్శించారు. కారాగారంలోని ఆసుపత్రిని, అక్కడ ఉన్న వైద్య సదుపాయాలను, వంటశాలలను, ఆహార ప్రమాణాలను పరిశీలించారు. ఖైదీలకు ఏర్పాటు చేసిన నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని సందర్శించారు. వెల్డింగ్, ఇతర నైపుణ్యాలలో శిక్షణ పొందుతున్న ఖైదీలతో మాట్లాడారు. వారు విడుదలైన తరువాత జీవనోపాధి కోసం ఈ శిక్షణ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నియమించిన పారా లీగల్ వలంటీర్లతో మాట్లాడారు. ఖైదీలకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవల గురించి తెలియజేయాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ప్రత్యేక మహిళా కారాగారాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. కారాగార వైద్య సిబ్బందితో మాట్లాడి ఖైదీల ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలతో కలిసి భోజనం చేశారు.

సహకార సంఘాల విస్తృతికి తోడ్పడాలి



బూరుగుపూడిలో మాట్లాడుతున్న డీసీసీబీ మేనేజర్ అప్పారావు

మధురపూడి: పెండింగ్ బకాయిలు (పారుబాకీలు) చెల్లించి సహకార సంఘాల విస్తృతికి తోడ్పడాలని డీసీసీబీ మేనేజర్ గాజింగం అప్పారావు రైతులను కోరారు. కోరుకొండ మండలం బూరుగుపూడి సొసైటీలో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంఘాలను బలోపేతం చేసేందుకు పారుబాకీలను విధిగా చెల్లించాలన్నారు. డీసీసీబీ ద్వారా రైతులకు జీరో బ్యాలెన్స్, మహిళలకు జన్‌ధన్ యోజన ఖాతాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల ప్రయోజనాలను వీటిద్వారా పొందవచ్చన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 52 బ్రాంచ్‌లు, 295 సొసైటీలున్నట్టు తెలిపారు. సొసైటీ చైర్ పర్సన్ బుడ్డిగ సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోరుకొండ బ్రాంచ్ సూపర్ వైజర్ ఉల్లి విష్ణుప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో సహకార సంఘాలు రైతులకు మంచి భవిష్యత్తు ఇస్తున్నాయని, దీంతో ఆర్థిక వెసులుబాటు కలుగుతుందన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా వడ్డీ రాయితీని పొందవచ్చన్నారు. సమావేశంలో సీఈఓ ఈదల సుదర్శనరావు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.


నిస్వార్థ సేవలతో ప్రజల మన్ననలు



విజయభాస్కర్‌ను సత్కరిస్తున్న తహసీల్దార్ సుభాష్ తదితరులు

పెదపూడి: విధి నిర్వహణలో నిస్వార్థ సేవలు అందించేవారికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని తహసీల్దార్ టి.సుభాష్ తెలిపారు. రామేశ్వరంలో సచివాలయం కార్యదర్శులు, ఇతర సచివాలయం ఉద్యోగుల ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల పెదపూడి ఎంపీడీఓగా పనిచేస్తూ డీఎల్‌డీఓగా పదోన్నతిపై కాకినాడ డ్వామా కార్యాలయంలో ఫైనాన్స్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన పోకల విజయభాస్కర్‌కు అభినందన సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుభాష్ మాట్లాడుతూ విజయభాస్కర్ సేవలను కొనియాడారు. అనంతరం విజయభాస్కర్‌కు శాలువా కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొటికలపూడి చినబాబు, ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల ఈశ్వర వెంకట సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధర్, పీఆర్ ఏఈ స్వామి, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, మన్యం శ్రీనివాసు చౌదరి, యాళ్ల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు శిబిరాలు ప్రారంభం



ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న దృశ్యం



బొబ్బిల్లంకలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణారావు

రాజానగరం: నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల వద్ద రెండు రోజులు నిర్వహించే స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటర్ల నమోదు ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. మండలంలోని జి.యర్రంపాలెం, సంపత్ నగరం, నామవరం, కొండగుంటూరు, భూపాలపట్నం, పుణ్యక్షేత్రం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పవన్ కుమార్ పరిశీలించి, సిబ్బందికి సూచనలిచ్చారు. జాబితాలో కచ్చితంగా ఆయా ఓటర్ల ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఓటరు నమోదు, సవరణలకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఏవిధమైన చర్యలు తీసుకుంటున్నారనే విషయాలను సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. డూప్లికేట్ ఓటర్లతో పాటు మరణించిన వారు జాబితాలో లేకుండా శ్రద్ధ తీసుకోవాలని బీఎల్‌ఓలకు సూచించారు. స్పెషల్ క్యాంపెయిన్ అయిన తరువాత ఒకటికి రెండుసార్లు పరిశీలన చేసుకుని, జాబితా ఫైనలైజేషన్‌కి సిద్ధపడాలన్నారు. ఆదివారం కూడా పోలింగ్ కేంద్రాల వద్ద ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

శిబిరాలను వినియోగించుకోవాలి

సీతానగరం: ఓటు నమోదు కోసం పోలింగ్ బూత్‌ల వద్ద శని, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని సహాయ ఓటరు నమోదు అధికారి, తహసీల్దార్ పాగిరి కృష్ణారావు తెలిపారు. తొలి రోజు పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించామని, సుమారు 90 వరకూ కొత్త ఓట్లు నమోదు చేశారన్నారు. నాలుగు రోజులుగా మండలంలో 18 నుంచి 20 ఏళ్ల నిండిన 600 మందిని గుర్తించామని, వారి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చుతున్నామన్నారు. మండలంలోని 61 పోలింగ్ బూత్‌ల వద్ద ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ బూత్‌స్థాయి అధికారులు అందుబాటులో ఉన్నారన్నారు.

కులగణనతో హక్కులకు రక్షణ



పెదపాటి డాక్టర్ బాబు

సీతానగరం: కులగణన సర్వేతో రాజ్యాంగ హక్కులకు రక్షణ లభిస్తుందని రాష్ట్ర దాసరి బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి రమేష్ బాబు (డాక్టర్‌బాబు) అన్నారు. ఆయన శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో కులగణనకు శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. ఇంటింటికీ కులగణన సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు.

మనోధైర్యంతోనే ఎయిడ్స్‌పై విజయం

సీటీఆర్ఐ: మనోధైర్యంతోనే ఎయిడ్స్‌ను జయించగలమని మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా కోనసీమ సేవా మండలి వ్యవస్థాపకుడు నేల కృపారావు ఆధ్వర్యంలో శనివారం హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ ఫుడ్, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ బాధితులపై వివక్ష చూపకుండా, వారికి పూర్తిస్థాయి అండగా ఉండాలని పిలుపు నిచ్చారు. కోనసీమ సేవామండలి ఫౌండర్ నేల కృపారావు మాట్లాడుతూ తమ సంస్థలో 12 వేల మంది హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగులు నమోదయ్యారని, ఏటా ఎయిడ్స్ దినోత్సవం రోజు వారికి న్యూట్రిషన్ ఫుడ్, మందులు, పండ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 400 మంది బాధితులకు 18 రకాల న్యూట్రిషన్ ఫుడ్, పండ్లు పంపిణీ చేశామన్నారు. ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ ఆర్.శిల్పా నాయుడు మాట్లాడుతూ హెచ్ఐవీ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడుతూ, న్యూట్రిషన్ ఫుడ్ స్వీకరించడం ద్వారా ఎక్కువ కాలం జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా శ్రీనగేష్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు మురళి, మెహర్, మధు, రవి, రామిరెడ్డి పాల్గొన్నారు.